ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 28 సెప్టెంబర్ 2025

## లలితాదేవిగా శ్రీభద్రకాళిని, లక్ష్మీదేవిగా శ్రీ వాసవి మాత.

చిట్వేలి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:

శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆరవ రోజు, శనివారం శ్రీ లలితా దేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు అర్చకులు చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. 28వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణ ఉత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ పెద్దలు తెలిపారు. భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొని వివాహ ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి రూపాన్ని దర్శించారు. భక్తులకు పెద్దలు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.




## నమో నమో దుర్గే...నమో నమో దుర్గే...

రాజంపేట, సెప్టెంబర్27 ప్రభాతవార్త

నమో నమో దుర్గే...నమో నమో దుర్గే... అంటూ భక్తులు ఆరో రోజు శనివారం అమ్మల గన్న అమ్మ జగన్మాతా, లోక పావని మనసా స్మరామి అంటూ అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తూ దర్శించుకున్నారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత మీనాక్షిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిశాలలో గర్భగుడి చెప్పు మీనాక్షిదేవిని మూడుసార్లు ఊరేగించి అనంతరం వేదిక పైన ప్రతిష్టించారు. వీర చౌడేశ్వరి ఆలయంలో విజయలక్ష్మి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చేపట్టిన పనులన్నీ దిగ్విజయం కావాలని కోరుతూ, విజయాన్ని ప్రసాదించాలని విజయలక్ష్మి అమ్మవారిని భక్తులు వేడుకున్నారు.




# ప్రజల సేవ, రక్షణ కోసమే ఖాకీ యూనిఫాం

- మహిళల రక్షణకు పోలీసు శాఖ అత్యధిక ప్రాధాన్యత
- అన్ని శాఖల సమన్వయంతో విధులు నిర్వహిస్తే సత్ఫలితాలు
- పోలీసు శాఖ వాట్సాప్, టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు
- కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకు మహిళల భద్రత - డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం
- జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



కడప క్రైం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

మహిళల రక్షణకు జిల్లా పోలీసు శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని వేధింపులు, ఇతర సమస్యలతో ఉన్న వారికి పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మహిళలకు భరోసా ఇచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా పోలీసు శాఖ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల సభ్యులకు, మహిళల భద్రత-డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఖాకీ యూనిఫాం ప్రజల సేవ, రక్షణ కోసమే అని పోలీసు శాఖ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రత-డ్రగ్స్ నిర్మూలనపై రాష్ట్ర సీఎం ప్రతి వారం సమీక్షిస్తున్నారని పోలీసు శాఖ కూడా సీరియస్‌గా దృష్టి సారించడం జరిగిందని పోలీసు అధికారులందరూ తక్షణం స్పందిస్తున్నారన్నారు. మహిళలకు సంబంధించి సమస్య చిన్నదిగా ఉన్నప్పుడు కాకుండా పెద్దదైన తరువాత పోలీసు శాఖ వద్దకు వస్తోందని వేధింపులు, ఇతరత్రా సమస్యలుంటే వెంటనే పోలీసు అధికారులను సంప్రదించాలన్నారు. అన్ని శాఖల అధికారులు కలిసి పని చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని విధులు నిర్వర్తించాలన్నారు. సమాజ అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉందన్నారు. డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపడం జరిగిందన్నారు. ఎక్కడైనా వాటి ప్రభావం ఉన్నట్లయితే 1972 టోల్‌ఫ్రీ నెంబరుకు, 8977781972 వాట్సాప్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర సాయం కోసం 112, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, గృహ హింస 181, మహిళల వేధింపులు 1091, సైబర్ నేరాలకు 1930లకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మహిళల భద్రత-డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మరింత సమర్థవంతంగా వేగవంతంగా సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జీఎస్టీలో సవరణల వల్ల వినియోగదారులకు ఎంతో మేలు చేకూరిందని, 99 శాతం వస్తువులు, సేవలు పన్ను రహితంగా మారాయన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలు చుటుట్టుపక్కల నివసించే వారందరికి తెలిపి చైతన్యం తీసుకురావాలన్నారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నిరక్షరాస్యత, పేదరికం వల్ల నేరాలు జరిగే అవకాశం ఉంటుందని మెప్మా ద్వారా పేదరిరక నిర్మూలనకు కృషిని వివరించారు. జిల్లాలో 8 మున్సిపల్ పట్టణాలలో 14556 స్వయం సహాయక బృందాలు ఉన్నాయని, ఒక్కో గ్రూప్‌లో 10 మంది సభ్యులుగా ఉంటారని వివరించారు. నేరాల కట్టడిలో పోలీసు శాఖకు మెప్మా తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఈగల్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను వవారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి, డీసీపీవో సుభాష్ యాదవ్, నగరంలోని సీఐలు, ఎస్సైలు, డొమెస్టిక్ వయొలెన్స్ అడ్వకేట్ పర్వీన్, వన్‌స్టాప్ సెంటర్ అడ్వకేట్ ఉమాదేవి, ఈగల్, నార్కోటిక్స్ విభాగం సిబ్బంది, కడప నగరంలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## చుండువారిపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో జగన్మోహన్ రాజు



చుండువారిపల్లె శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న జగన్ మోహన్ రాజు

రాజంపేట, సెప్టెంబర్27 ప్రభాతవార్త

మండలంలోని చుండువారిపల్లె శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కళ్యాణం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం ప్రారంభించి 13వ సంవత్సరంలో పూర్తయిన సందర్భంగా శ్రీవారికి అంగరంగ వైభవంగా గ్రామస్తులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కళ్యాణంలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవంలో టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామికి పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న చమర్తికి ఘనస్వాగతం పలికిన చుండువారిపల్లి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి ఆశీర్వాదం తీసుకొని గ్రామంలో ప్రజలకు స్వామివారి అనుగ్రహం ప్రసాదించి వారికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అలాగే వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని భగవంతున్ని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ , తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుని దుశ్యాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు రమణయ్య నాయుడు, పార్టీ నాయకులు నాగినేని నాగేశ్వర్ నాయుడు, బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, కోటయ్య నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దు కృష్ణారెడ్డి, పరశురాం , తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో ప్రభావితం చేసేవారి ద్వారా సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనరాథలపై ప్రజల్లో అవగాహనకు ప్రణాళికలు

కడప క్రైం, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కోరారు. జిల్లాలో పోలీసు సిటిజెన్ కోఆపరేషన్‌లో భాగంగా సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు భాగస్వాములు కావాలని సోషల్ మీడియాలో ప్రభావితం చేసే వారికి జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని 50 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సైబర్ నేరాలు, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో చైతన్యం తేవడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. పోలీసు శాఖాపరంగాపై అంశాలపై అలుపెరగని కృషి చేస్తూ చర్యలు తీసుకుంటామన్నారు.

**సోషల్ మీడియా మార్గదర్శకాలు పాటించాలి : జిల్లా ఎస్పీ**

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తాము పెట్టే పోస్టులలో సోషల్ మీడియా మార్గదర్శకాలు పాటిస్తూ పోస్టు చేయాలని ఎస్పీ సూచించారు. మహిళలు, బాలికలపై, న్యాయవ్యవస్థ, వ్యక్తిగత దూషణలను, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చేలా పోస్టులను గుర్తిస్తే వెంటనే ఫ్లాగ్ చేసి వెంటనే జిల్లా పోలీసు శాఖ సోషల్ మీడియా ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా చేసిన కడప పోలీస్‌సోషల్‌మీడియాజీమెయిల్‌కు లేదా వాట్సాప్ 9121100686కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు, సైబర్ క్రైం, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వరరెడ్డి, సైబర్ క్రైం, సోషల్ మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

## 239 మందికి వైద్య పరీక్షలు

దువ్వూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభయాన్ కార్యక్రమం కింద నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 239 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు సురేష్ బాబు, రోషిని, హేమలతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు రక్త పరీక్షలు, గర్భిణీలకు స్కానింగ్, చిన్నారులకు అవసరమైన టీకాలు ఉచితంగా వేశారు. ఈ వైద్య శిబిరానికి కంటి పరీక్షలు నిర్వహించే జనరల్ మెడిసిన్, స్త్రీ వ్యాధి నిపుణులు తదితరుల నిపుణులు హాజరయ్యారు. డయాబెటిస్, బీపీ వ్యాధిగ్రస్తులు, కంటి శుక్లాలు ఉన్న వారికి ప్రత్యేక చికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే ఐసిడిఎస్ తరఫున ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలి అనే అంశంపైన గర్భవతులకు, బాలింతలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎంవో డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, సుధా, రాజేష్, పవన్ కుమార్, ఖలందర్, వైద్య సిబ్బంది చంద్రమోళి, రాజగోపాల్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్‌టీ స్లాబ్‌పై అవగాహన సదస్సు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



మండలంలోని పెండ్లిమర్రి వెలుగు కార్యాలయంలో శనివారం వీఏఓలు, గ్రామ సమాఖ్య లీడర్లకు తగ్గిన జీఎస్టీ స్లాబ్‌లపైన అలాగే మహిళల భద్రతపై, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల సమాజం, కుటుంబానికి జరిగే నష్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పెండ్లిమర్రి ఎస్సై మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. మహిళలపై అత్యాచారాలు, వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిని కుటుంబంలోనే అవగాహన కల్పించాలని తల్లిదండ్రులు పిల్లల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీఎం బాలస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం జీఎస్టీ రేట్లు బాగా తగ్గించిందని ఏయే వస్తువులపై రకేట్లు ఎంత శాతం తగ్గించింది వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఓలు, మండల సమాఖ్య లీడర్లు, గ్రామ సంఘం లీడర్లు వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కెరియర్ గైడెన్స్ ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహణ

రాయచోటి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థుల కెరియర్ గైడెన్స్ కోసం ప్రత్యేక ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య రిసోర్స్ పర్సన్ గా డాక్టర్. మహేష్ పవన్ సాతవల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థిని హాజరైనవిద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంబీఏ విద్య అనేది కేవలం ఒక డిగ్రీ కాదు, అది భవిష్యత్తుకు మార్గదర్శకం. మేనేజ్మెంట్ కోర్సు ద్వారా లీడర్షిప్, సమస్యల పరిష్కారం, వ్యాపార అవగాహన, టీమ్ వర్క్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. భవిష్యత్తు కెరీర్‌లో విజయానికి ఇవి కీలకం" అని పేర్కొన్నారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ"ఈ ఇండక్షన్ ప్రోగ్రాం లక్ష్యం విద్యార్థులలోఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారిని కోర్సు నిర్మాణం, అకడమిక్ షెడ్యూల్, ఇంటర్న్‌షిప్స్, పరిశ్రమ అవకాశాలపై అవగాహన కల్పించడం. విద్యార్థులు క్లాస్‌రూమ్ లెర్నింగ్‌తో పాటు ప్రాక్టికల్ అనుభవం పొందాలి" అని సూచించారు.ఎంబీఏ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్ మాట్లాడుతూ,"నేటి మేనేజ్మెంట్ విద్యార్థులు కేవలం పుస్తకాల చదువుతో ఆగిపోకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్, డిజిటల్ టూల్స్ వాడకం, ఆంత్రప్రెన్యూర్షిప్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. కళాశాల తరఫున వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇండస్ట్రియల్ విజిట్స్, లైవ్ ప్రాజెక్టులు అందుబాటులో ఉంటాయి" అని వివరించారు.సీనియర్ ప్రొఫెసర్లు విద్యార్థులను ప్రేరేపిస్తూ, మేనేజ్మెంట్ కోర్సును కేవలం ఉద్యోగం కోసం కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ, స్టార్టప్ ఐడియాస్, కొత్త ఆవిష్కరణలు, వ్యక్తిత్వ వికాసంలో అవకాశాలను వినియోగించుకోవాలని కొత్త విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కుక్కలు దాడి లో30 మేకలు మృతి

బ్రహ్మం గారి మఠం సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



బ్రహ్మంగారిమఠం మండలంలో పలుగురాళ్ళ పల్లి పంచాయితీ జౌకుపల్లి గ్రామంలో రాత్రివేళ మేకల దొడ్డిలో కుక్కలు పడి 30 మేకలు పిల్లలను కొరికి చంపేయడం జరిగింది. వివరాల్లోకెళితే మండ్నల లో జౌకుపల్లిలో నివాసం ఉంటున్న జాల ప్రసాద్,జాల జ్యోతి దంపతులు ఇద్దరు సంతానం కలదు, మేకలు మేపుటకు ఉదయం కొండకు వెళ్లి రాత్రి కి ఇంటికి తిరిగి వచ్చేవారని ప్రతి రోజూ లాగే వచ్చాడని, మేకలు కాసుకుంటునే జీవనం సాగించేవారని శుక్రవారం జాల ప్రసాద్ కు జ్వరం రావడంతో ఇంటిలో నిద్రిన్నచగా దీంతో రాత్రి వేలలో మేకల దొడ్డిలో కుక్కలు పడి సుమారు 30 మేక పిల్లలను కొరికి చంపేయడం జరిగిందని వారు ఆవేదన చెందారు. మా జీవనోపాధి కోల్పోయామని మాకు లక్షలలో అప్పులు అయ్యాయని ఇంకా బతుకుతెరువు కోసం ఏమి చేయాలో అర్థం కాలేదు అని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న వారిని చూసి గ్రామస్తులు అందరూ కన్నీరు పెట్టి ఆవేదన వ్యక్తం చేశారు,ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారు స్పందించి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అదేవిధంగా చర్యలు తీసుకుంటారని,అలాగే గ్రామం నుంచి కుక్కలను నిర్మూలించాలని వేడుకుంటున్నారు.

## శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో వైభవంగా దసరా ఉత్సవాలు

బద్వేల్ అర్బన్ సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



బద్వేల్ పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం దసరా ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఒరుగంటి సీతారామ శర్మ, ప్రసాదు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుండి స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించడం జరిగిందని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం కమిటీ ఆలయ శాశ్వత ధర్మకర్త ప్రొద్దుటూరు కిషోర్ కుమార్, అధ్యక్షులు దేవతి సురేంద్ర, వైస్ ప్రెసిడెంట్ వడ్లపూడి నాగభూషణం, తిరివీధి లక్ష్మణరావు, ఓబుల శెట్టి చిన్న సుబ్బరాయుడు, జాయింట్ సెక్రెటరీ చిప్పగిరి ఆంజనేయులు, దేవతి వెంకట సుధాకర్, యువజన సంఘం గౌరవ అధ్యక్షులు పత్తి సాయి పవన్, ప్రెసిడెంట్ చిన్ని సత్యనారాయణ,వైస్ ప్రెసిడెంట్ ప్రొద్దుటూరు సాయి కార్తీక్, ఇమ్మడిశెట్టి హరి మనోజ్, సెక్రెటరీ గూడూరు తరుణ్, నవీన్ సముద్రాల, అడ్వైజర్ కొప్పరపు తరుణ్, జాయింట్ సెక్రటరీ మిట్ట సాయికుమార్, చీదెల్ల జగదీష్, ట్రెజరర్ ఒరుగంటి సాహసమిత్ర, కొప్పరపు గురు అంకిత్, జాయింట్ ట్రెజరర్ సముద్రాల సుబ్బారావు, మిట్టా సతీష్ కుమార్, మరియు పలువురు యువజన కమిటీ సభ్యులు తెలిపారు,రాత్రి శ్రీ వైష్ణవి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు, ప్రత్యేక ఉభయ దాతలుగా కీర్తిశేషులు మిట్టా వెంకటరమణయ్య ధర్మపత్ని కీర్తిశేషులు సరోజనమ్మ కుమారులు మిట్టా సుబ్బారావు సతీమణి సుజాత కుమారుడు జగదీష్, కీర్తిశేషులు మిట్టా సత్యనారాయణ సతీమణి సువర్ణ కుమారుడు సాయి కుమార్, మిట్టా రమేష్ బాబు సతీమణి కళ్యాణి కుమారుడు నితేష్ తనుష్ కుమార్తె జయశ్రీ వారి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలను అందజేయడం జరిగింది, దసరా మహోత్సవం పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకునేందుకు విసెస సంఖ్యలో భక్తులు తరలివచ్చి కాయా కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు, ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పై అధికారులు వేగంగా స్పందించాలి

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు

రాజంపేట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్రాజు

ప్రజలు రెవిన్యూ సమస్యల పై పరిష్కారం కోసం వచ్చినప్పుడు అధికారులు వేగంగా స్పందించి పరిష్కరించాలని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు కోరారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యంలో తాసిల్దార్ పీర్ మున్నితో కలిసి జగన్మోహన్రాజు మండలంలోని అధికారులతో మాట్లాడారు.గ్రామాలలో ప్రజల సమస్యల కోసం పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పుడు పరిష్కరించాలని కోరారు.ప్రజలను ఆఫీసులో చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను సానుకూలంగా విని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన తెలిపారు. ప్రమాదవశాత్తు గాయపడిన జూనియర్ అసిస్టెంట్ మణి కుటుంబ సభ్యులకు 50,000 ఆర్థిక సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్ఐ శేషం రాజు, గ్రామాల రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కొత్తమీర పంటతో లాభాలు

- 40రోజుల్లో పంట చేతికి రావడంతో సాగుపై మక్కువ

కురబలకోట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



కొత్తిమీరపంట సాగుచేస్తున్న దృశ్యం

ప్రస్తుత సీజన్‌లో రైతన్నకు గడ్డుకాలం ఎదురైంది. పండిన అరకొర పంటకు గిట్టుబాటు ధరలేదు. మరికొన్ని చోట్ల సాగు చేసిన పంటలకు సాగునీరు లేక ఎండిపోయాయి. రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. అయితే ఈ పరిస్థితుల్లో కొత్తిమీర సాగ రైతన్నలకు అశాజనకంగా కనిపిస్తొంది. నియోజకవర్గంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఈ పంటను పండించి లాభపడుతున్నారు. చుట్టూ ప్రక్కల గ్రామాల్లో సుమారు 100ఎకరాల వరకు ఈ పంటను సాగు చేస్తున్నట్లు తెలుస్తొంది. కొత్తిమీర పంట కేవలం 40రోజుల్లోనే చేతికి అందుతుండడంతో సాగునీరు ఉన్న రైతన్నలు ఎక్కువ మంది కొత్తిమీర సాగుపట్ల మక్కువ చూపుతున్నారు. ఇప్పుడు మార్కెట్‌లో కొత్తమీర కట్ట రూ.30లు పలుకుతోంది. కొత్తమీర పంటను హైదరాబాద్, మహబూబ్‌నగర్, కర్నాటక రాష్ట్రంలోని బళ్ళారి, రాయచూరు, చెన్నై తదితర రాష్ట్రాలకు ఎగుమతి అధికంగా ఉంటుంది. కొత్తిమీర పంట ఆశాజనకంగానే ఉంది. పంటకు ప్రస్తుతం కొద్దోగొప్పో గిట్టుబాటు ధర పలకుతుండడం విశేషం. పశ్చిమాన టమోటా పంట అధికంగా వేశారు. పంట బాగా దిగుబడి వచ్చి ధరలు పెరగడంలేదు. ఆశాజనకంగా ఉన్న కొత్తిమీరను కూడా వేయడంతో కొత్తమీర సాగు మాత్రం కాసులు కురిపిస్తోంది. ఈ పంట ద్వారా వస్తున్న ఆదాయంతో రైతన్నలు కొంత ఊరట చెందుతున్నారు. ఈ పంట సాగు చేయాలంటే ఒక ఎకరా పంటకు పెట్టుబడి రూ.20వేలు నుంచి 25వేల వరకు ఉంటుందని రైతన్నలు చెబుతున్నారు. విత్తనాలకు రూ.10వేలు, ఎరువులు కలుపుతో పాటు ఇతర పెట్టుబడులకు రూ.10వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. ఒక ఎకరంలో 80నుంచి 100మళ్లు ఉంటాయి. పంట చేతికి 40రోజుల్లో అందుతుందని దీంతో పంటసాగుకు కొంత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రైతులు లాభపడుతున్నారు. ఏది ఏమైనప్పటికి టమోటా ధరలు మాట ఎలా ఉన్నా చిన్న పంటగా వేసుకొని పెద్దలాభం పొందవచ్చు.

## పూర్వ విద్యార్థినిల సమ్మేళనం

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త




మండల పరిధిలోని గౌతమి ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థినిల సమ్మేళనం జరిగినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విదార్థినిలు కళాశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని, ఫ్యాకల్టీలతో తమకున్న అనుబంధాలను నెమరు వేసుకున్నారు. కళాశాల డైరెక్టర్లు నాగూరు, రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థినిలు సమాజంలో ఇంత ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ బాచబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, డిప్లొమా ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, వివిధ విభాగాధిపతులు అలీ జాబిర్, విజయమ్మ, ఆధ్యాపక బృందం పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత...

ముద్దనూరు. సెప్టెంబర్ 27 ప్రభాతవార్త;

మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో శుక్రవారం ఉప్పులూరు గ్రామానికి చెందిన పోల్ రెడ్డి వద్ద నుంచి 12 షార్ట్ విస్కీ బాటిల్లను స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసిన కేసులో (పోల్ రెడ్డి కి బదులు కొండారెడ్డి అని పొరపాటున ప్రచురించినందుకు ఖండన.

## అంగన్వాడి స్కూల్ తనిఖీ చేసిన ఎంపీడీవో

సిద్ధవటం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



అంగన్వాడి ప్రీ స్కూల్ భవనాన్ని మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి శనివారం తనిఖీచేబట్టి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అంగన్వాడి స్కూల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత లోపం లేకుండా చూడాలని సూచించారు స్కూలు పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత లేకుండా పరిశుభ్రంగా పెట్టాలని పిల్లల సంఖ్య పెరిగేటట్లు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అంగన్వాడి సెంటర్లో పిల్లలను చేర్చే విధంగా కృషి చేయాలని గర్భవతులకు పలు సలహాలు సూచనలు అందించాలని ఎంపీడీవో ఫణి రాజకుమారి తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సెమినా, ఆయా, ఎల్లమ్మ పిల్లలు పాల్గొన్నారు.

## ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు..




కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి లేదని, అరకొర సంక్షేమ పథకాలతో ఏడాది కాలం గడిచింది.. ప్రజలకు ఏమాత్రం మేలు చేయకపోగా ప్రజా సమస్యలపై గలమెత్తుతున్న వైసీపీ నాయకులపైన, కార్యకర్తల పైన, సోషల్ మీడియా ఆక్టివిస్టల పైన అక్రమ కేసులు బనాయించారని వైకాపా జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, ఎమ్మెల్యే డా.సుధా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కడప వైకాపా కార్యాలయంలో డిజిటల్ యాప్ కలిగిన క్యూఆర్ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రశ్నించిన వారిపై పాత కేసులు తిరగదుడుతున్నారని, లేనివారి ఎడల నూతన కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. వారందరికీ భరోసా కల్పించేందుకు నూతనంగా యాప్ ను మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందుబాటులోకి తెచ్చారన్నారు. కేసులు ఉన్నవారు, సామాన్యులు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 2029లో అధికారంలోకి వచ్చాక అక్రమ కేసులు బనాయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకులు అజయ్ రెడ్డి, రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి, పులి సునీల్, రామకృష్ణారెడ్డి, షఫీ, దాసరి శివప్రసాద్, రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, సిందే రవిచంద్ర, జమాల్ వలి, యానాదయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మైనార్టీ ప్రభుత్వ సలహాదారున్ని కలిసిన నాయకులు

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాష్ట్ర మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడు, శాసనమండలి మాజీ ఛైర్మెన్ ఎస్.ఎం.షరీఫ్‌ను మదనపల్లెకు చెందిన రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, హాజ్‌కమిటీ సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్‌లు కలిశారు. శనివారం హార్సిలీహిల్స్‌కు విచ్చేసిన ఆయనను కలసి శాలువతో సత్కరించారు. మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సలీం, షేక్ లతీఫ్, నిమ్మనపల్లె షాజిద్, దాదు, బి.కొత్తకోటకు చెందిన మాజీ జడ్పిటిసి పర్వీన్‌తాజ్, మస్తాన్‌తో పాటు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంటురోగాలకు దూరంగా ఉండాలి

### తడి,పొడిచెత్తను వేరు చేయిస్తున్న వార్డు ఇన్‌చార్జ్ ఇక్బాల్

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



తడి,పొడి చెత్తను తొలగిస్తున్న వార్డు ఇన్‌చార్జ్

పట్టణంలోని 18వ వార్డు సైదాపేటకు చెందిన వార్డు ఇన్‌చార్జ్ సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో శనివారం వార్డులో గత రెండు రోజులుగా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేయిస్తూ, వార్డులో ఫాగింగ్ చేయించడం, కాలువలపై బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని కాలువుల్లో చెత్త చెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతుండడంతో 18వ వార్డు ప్రజలు వార్డు ఇన్‌చార్జ్ సయ్యద్ ఇక్బాల్ దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన వార్డు ఇన్‌చార్జ్ ఇక్బాల్ కాలువ పూడికతీత పనులు చేయించారు. అంతేకాకుండా వాటర్ ట్యాంకులు రిపేరి, వాటర్‌ను సప్లై చేయించడం వంటివి చేపట్టారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తెస్తే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు పనులుచేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం జేసిబితో వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. దీంతో వార్డు ప్రజలు ఆయనను అభినందిస్తున్నారు.

## డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ

దువ్వూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో శనివారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ముద్రించిన డిజిటల్ రేషన్ కార్డులను మండల టిడిపి నాయకులు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన దువ్వూరులో దువ్వూరు టౌన్ ఇన్చార్జ్ రాంబాబు అలాగే మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, రైతు సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డిలు పంపిణీ చేశారు. అలాగే సంకటిదిమ్మాయపల్లిలో మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణా రెడ్డి, నేలటూరులో సర్పంచ్ రవీంద్రారెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజిటల్ రేషన్ కార్డుల వల్ల వినియోగదారులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తహార్ హుస్సేన్, నాగరాజులు పాల్గొన్నారు.



## బాధ్యతాయుతంగా పనిచేయాలి

రామసముద్రం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త

పిల్లలకు, తల్లులకు పౌష్టికారం అందించడంతో పాటు బాల్య వివాహాలు అరికట్టడం, మహిళలపై జరిగే అఘాత్యాల నివారణ తదితర సామాజిక బాధ్యతల నిర్వహణలో అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యతాయుతంగా పని చేయాలని సి డి పి ఓ నాగవేణి పేర్కొన్నారు. మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీ దిగువ హరిజనవాడ లో శనివారం జరిగిన అంగన్వాడీ అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ సెంటర్ ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పనిచేయాలని, ప్రతి ఒక్కరికి మెనూ ప్రకారం ఫుడ్ ఇవ్వాలని, ప్రీస్కూల్ నమోదు హాజరు శాతాన్ని పెంచాలని అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. వారానికి ఒకసారి పిల్లల బరువు, ఎత్తు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సి డి పి ఓ నాగవేణి, సూపర్ వైజర్ రమాదేవి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూపర్ సేవిగ్స్‌పై అవగాహన కార్యక్రమం

రామసముద్రం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



రామసముద్రం మండల కేంద్రంలో శనివారం సూపర్ జి ఎస్ టి సూపర్ సేవిగ్స్ పై జి ఎస్టీ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ రఫీ, ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ అధ్యక్షతన వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రఫీ మాట్లాడుతూ సూపర్ జి ఎస్టీ సూపర్ సేవిగ్స్ ద్వారా ప్రజలకు ఆర్థికంగా ఎంతో మేలు జరిగిందన్నారు. 90 వస్తువులు పై జి ఎస్టి పన్నులు తగ్గించారన్నారు. తగ్గించిన జి ఎస్ టి రేట్ల ప్రకారం వినియోగదారులకు వస్తువులు విక్రయించాలని ఆయన వ్యాపారులకు సూచించారు. అలాగే తగ్గించిన జి ఎస్ టి ప్రకారం వస్తువుల ధరల పట్టికను దుకాణాల ముందు ఏర్పాటు చేయాలన్నారు. వస్తువుల ధరలకు సంబంధించిన కరపత్రాలను త్వరలోనే దుకాణదారులు అందిస్తామని రఫీ తెలిపారు . జి ఎస్ టి తగ్గక మునుపు కొనుగోలు చేసిన వస్తువులను కూడా తగ్గిన రేట్లతోనే అమ్మాలని, అలా కాకుండా అధిక ధరలకు అమ్మితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రఫీ హెచ్చరించారు. ప్రజా ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జి ఎస్ టి తగ్గింపు వినియోగదారులకు చేరేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు సిరాజ్ భాషా, బద్రినాథ్ శెట్టి, చంగారెడ్డి, విశ్వనాథం శెట్టి, రమేష్, సురేష్, మణికంఠ సత్యనారాయణ, జనార్ధన్ బండ్ల తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ సహాయకురాలి సేవలు ప్రశంసనీయం

పీలేరు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



సత్కరిస్తున్న సర్పంచ్, సిబ్బంది

గ్రామపంచాయతీ కార్యాలయంలో జూనియర్ సహాయకురాలిగా పనిచేసిన చంద్రకళ సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ చంద్రగిరి పంచాయితీ కార్యాలయానికి బదిలీపై వెళుతున్న చంద్రకళకు శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఆమెను సత్కరించి ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లికార్జున రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఉదయ్, అబిద్, నాగరాచనాయక్, సచిన్ అనే కాలేషా, పరమేష్, కాలేష, శానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రెడ్డి, తులసి రెడ్డి, యూనియన్ నాయకులు వెంకటరామయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

పీలేరు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం (నేడు) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్చార్జి ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కంభం సతీష్రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతనిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

## తోట సుధాకర్ ప్రసాద్ అడుగుజాడల్లో నడవాలి




ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 27 ప్రభాత:

ప్రొద్దుటూరు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవనంలో మాజీ ఏపీ ఎన్జీవో రాష్ట ప్రధాన కార్యదర్శి కీర్తిశేషులు తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణ ఆదేశానుసారం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మరియు జిల్లా కార్యదర్శి నిత్య పూజయ ఆదేశానుసారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు అధ్యక్షులు రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య వారు చేసిన సేవలు గురించి గొప్పగా కొనియాడారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క ఎన్జీవో లీడర్ కూడా వారి అడుగుజాడల్లో నడిచి మంచి పేరు సంపాదించుకోవాలని కోరారు. ఆయన పోరాట పటిమను గురించి మాజీ రాష్ట్ర నాలుగవ తరగతి ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ రాఘవయ్య మాట్లాడుతూ ఆయన గురించి చాలా నిజాయితీపరుడని రమణయ్య దగ్గర పని చేశారని కొనియాడారు. చాలా నిజాయితీపరుడని రమణయ్య ప్యానెల్ లో సెక్రటరీ ప్రధాన కార్యదర్శిగా పూర్ణచంద్రరావు నాయకత్వంలో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సహాధ్యక్షుడు సదా శివయ్య, వైస్ ప్రెసిడెంట్ శివ రామానుజ, మధు జాయింట్ సెక్రెటరీ రాజశేఖర్, మహేశ్వరయ్య మాజీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు విశ్రాంత ఉద్యోగులు నాగన్న, లక్ష్మీ నారాయణ, జాకోబ్ ఉద్యోగుల ప్రొద్దుటూరు అధ్యక్ష కార్యదర్శులు పీరా, ఓంకార్ పాల్గొన్నారు.

## మండల సమాఖ్యలో ఆడిటింగ్

పెండ్లిమర్రి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

సెర్ప్ నుంచి వచ్చిన ఆడిటర్లు పెండ్లిమర్రి మండలంలోని మండల సమాఖ్య మరియు నాలుగు గ్రామ సంఘాల (కొండూరు వీవో, పెండ్లిమర్రి వీవో, నందిమండలం వీవో, కొత్తగిరియపల్లి వీవో) కార్యాలయాల్లో లెక్కలు గత 4 సంవత్సరాల నుంచి జరిగిన లావాదేవీలపై ఆడిటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం బాలస్వామి, ఎంఎస్ లీడర్లు, సంబంధిత వీఏఓలు, సీసీలు పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యేకి దుస్సాలువతో సన్మానం

పీలేరు , సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:



మాజీ ఎమ్మెల్యేని సన్మానిస్తున్న దృశ్యం

వైఎస్సార్సీపీ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబరుగా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని పీలేరు వైఎస్సార్సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం మండలంలోని రేగళ్లులో మాజీ ఎమ్మెల్యేని దుశ్శాలువలు కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సూచనల మేరకు గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దండు జగన్మోహన్ రెడ్డి. విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్, విక్టరీ వెంకటరమణారెడ్డి, , నాగరాజనాయక్, రెడ్డెప్ప, లోకనాథం, సి.వి. రావు పాల్గొన్నారు.

## లలితాత్రిపుర సుందరిదేవి అలంకరణలో అంకాలమ్మ

పీలేరు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శనివారం స్థానిక మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణ, పూజలు నిర్వహించారు. అలాగే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవికి అలంకరణ చేశారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు. పంపిణీ చేశారు.

## శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

సుండుపల్లి, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :



మండలం ఆరోగ్య పురం ఎన్ జే ఆర్ కాలనీలో వెలసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయము నందు నవరాత్రుల సందర్భం మొదటి శనివారం స్వామివారికి అభిషేకం, పూల అలంకరణ, పూజా కార్యక్రమం, నైవేద్యం ఇవ్వడం జరిగినది. దేవాలయము నందు ఆంజనేయ స్వామికి పూల అలంకరణ, పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. ఈరోజు స్వామివారికి పూల అలంకరణ చేయించినవారు ముదుంపాడు గ్రామం శివరాంపురం లో నివాసం కందుల సుప్రజ వీరాంజనేయులు కుటుంబ సభ్యులు పూలంకరణ చేయించి వచ్చిన భక్తులందరికీ అర్చన చేసి ఆశీర్వాద వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగినది అర్చక స్వామి అమృనాయక్ తెలిపారు.

## శ్రీ వారాహిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి దేవి

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి దసరా ఉత్సవాల్లో భాగంగా అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 6గంటలకు సుప్రభాతం కార్యక్రమాన్ని నిర్వహించారు. 7 గంటలకు అభిషేకం, 8గంటలకు మహామంగళి హారతి, 9.30గంటలకు తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 5.30గంటలకు సారే కార్యక్రమం, 7గంటలకు శ్రీ వారాహిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా ఆర్య వైశ్యసంఘం సభ్యుల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి.

## ఆరవ రోజు శ్రీ గజలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు



పోరుమామిళ్ల రూరల్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం పోరుమామిళ్ల లో దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా శనివారం 6వ రోజు శ్రీ గజలక్ష్మి దేవి అలంకారం అత్యంత వైభవంగా దర్శన మిచ్చారు. ఉదయం మహిళా మండలి వారు లలితా సహస్ర పారాయణం చదివారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఆ నలుగురి పాత్రలో...



ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 27 ప్రభాత వార్త :

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు వడ్డరపు లక్ష్మీదేవి అనే మహిళ మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు లేకపోవడంతో ముద్దునూరు పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి శనివారం హిందు స్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, ఈశ్వర్ వర్ధన్ రెడ్డి, కృప ఆగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు పాపిషెట్టీ వెంకట లక్ష్మమ్మ, సుమన్ బాబు, ప్రసన్న కుమార్, మైఖేల్ బాబు మరియులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే వరద అండతోనే పెరిగిన అసాంఘిక కార్యక్రమాలు



ప్రొద్దుటూరు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి అండదండలతోనే ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యక్రమాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులకు ఒక సారి స్వేచ్ఛను ఇస్తే ఒక వారంలో అసాంఘిక కార్యకలాపాలను అణచివేస్తారన్నారు. ఇటీవల ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పవిత్రమైన దేవాలయం లాంటి అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో మట్కా. క్రికెట్ బెట్టింగ్, జూదం జరుగుతున్నా పోలీసులు రూపుమాపడానికి సహకరించలేదని, లంచాలు తీసుకొని అసాంఘిక శక్తులకు సహకరిస్తున్నారని పోలీసులపై నిందలు మోపడాన్ని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నంత కాలం ప్రొద్దుటూరులో తన అండతోనే అసాంఘిక కార్యకలాపాలన్నీ జరుగుతున్నాయని అప్పట్లో వరదరాజులరెడ్డి తనను విమర్శించారన్నారు. ఈ రోజు అధికార పార్టీ ఎమ్మెల్యేగా వరద కొనసాగుతున్నప్పటికీ పోలీసులపై నిందలు ఎలా వేస్తారు అని నిలదీశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండి ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజుల రెడ్డి కి బాధ్యత ఉంటుందన్నారు. అలాంటిది ఎమ్మెల్యే వరద బాధ్యత తీసుకోకుండా అసాంఘిక కార్యక్రమాలను అణచివేయడంలో పోలీసులపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట జరగడానికి పోలీసులు కారణం కాదన్నారు. ఇందులో పోలీసుల పాత్ర ఏమాత్రం లేదన్నారు. రాజకీయనాయకులు, అధికార పార్టీ ఎమ్మెల్యేల అండతో ఇవన్నీ జరుగుతాయని రాచమల్లు చెప్పారు. అధికార పార్టీ ఎమ్మెల్యేనే సియోజకవర్గంలో ఏం జరిగినా పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు నిజంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి చిత్తశుద్ధి ఉండి ఉంటే జూదం ఆడేవారిని ఎన్నికల ముందు టీడీపీలోకి ఆహ్వానించే వారు కాదని చెప్పారు. ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున చందాలు తీసుకొని, వారి ద్వారా ఇతర ఆదాయ వనరులు సమకూరడంతో ఎర్రతివాచి పరచి మరీ పార్టీలో చేర్చుకున్నారన్నారు. ప్రొద్దుటూరు లో అసాంఘిక కార్యక్రమాలు అరికట్ట పడాలంటే ఎమ్మెల్యే వరద కుమారుడు నంద్యాల కొండారెడ్డిని అదుపులో పెట్టుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలు పాల్పడే వారిని పోలీసులు పట్టుకొని వెళ్తే కొండారెడ్డి సీఐలు, ఎస్ఐ లకు ఫోన్ చేసి వదలిపెట్టమని హుకుం జారీ చేస్తున్నాడని విమర్శించారు. ముందుగా టీడీపీలో ఉండే అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని సస్పెండ్ చేసి, అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించమని ఎమ్మెల్యే వరద పోలీసులకు ఆదేశాలిస్తే వారం రోజుల్లోనే అరికట్టే అవకాశం ఉందన్నారు. టిడిపిలో ఉండి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారు ఎవరనేది తనకు తెలుసని అన్నారు. వీళ్లంతా కౌన్సిలర్లుగా, గ్రామ నాయకులుగా చలామణి అవుతున్నారని పేర్కొన్నారు.

## కులవృత్తిలోకి రానివ్వకుండా అడ్డుకోవాలని వినతి




బద్వేలు అర్బన్ ,సెప్టెంబర్ 27 ,ప్రభాతవార్త

నాయి బ్రాహ్మణ కులవృత్తి అయిన క్షవరం మరియు బ్యాండ్ మేళం లోనికి ఇతరులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం అందరూ నాయి బ్రాహ్మణులు ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు బద్వేలు పట్టణ నాయీబ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షులు వడ్డమాను గురుబ్రహ్మం, ఉపాధ్యక్షులు పసుపులు గురుస్వామి మరియు సంఘ సభ్యులు ఆయనకు విషయం తెలియజేస్తూ తరతరాలుగా మా పెద్దల కాలం నుండి సమాజానికి క్షౌవరం చేయడం, వివాహాల సందర్భంలో సన్నాయి మరియు బ్యాండ్ మేలాలు వాయిస్తూ, జీవితాన్ని కొనసాగించుచున్నామనీ, బద్వేలు పట్టణంలోని దాదాపు 500 కుటుంబాలు కులవృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగించు చున్నామన్నారు .ప్రస్తుతం మా కులవృత్తిలోకి కార్పొరేట్ వ్యవస్థను తీసుకొని వచ్చి, ఓ వ్యక్తి మైదుకూరురోడ్డులో "బ్యూట్ కేర్ సెంటర్" పేరుతో నూతన సెలూన్ షాపు ప్రారంభించుచున్నారనీ ఈ విషయాన్ని మా సంఘ సభ్యులందరం తీవ్రంగా వ్యతిరేకించి ఈరోజు నుండి సమాజానికి క్షౌవరం, సన్నాయి మరియు బ్యాండ్ మేలాలు వాయించకుండా నిలుపుదల చేస్తున్నామనీ తెలిపారు. అతని షాపును అడ్డుకునేందుకు స్వచ్ఛందంగా షాపులన్ని మూసివేసి సంసిద్ధులయినామన్నారు. కావున విచారించి మాకు తగు న్యాయం చేయగలరని కోరారు.

## తోట సుధాకర్ ప్రసాద్ సేవలు ప్రశంసనీయం..

కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:

ఏపీ ఎన్జీవో మాజీ ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీ.శే. కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం కడప ఏ.పి.ఎన్జీజివో హోంలో అసోసియేషన్ జిల్లా అధక్యులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్య దర్శి నిత్య పూజయ్యలు కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ ఎన్ జి వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక విశ్రాంత ఉద్యోగుల రావలసిన న్యాయ పరమైన రాయితీల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రమాదంలో కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ అకాల మరణం పొందారని గుర్తు చేశారు. వారి ఆశయాలను ఏపీ ఎన్ జి జి వో అసోసియేషన్ మరియు ఏపీ జేఏసీ ముందుకు తీసుకు వెళ్తూ వారి ఉద్యమ స్ఫూర్తిని కోనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టీ శ్రేనివాసులు, సిద్దయ్య రాజశేఖర్, పద్మనాబారావు, హీరోమియా, సీటీ అధ్యక్షులు చిన్నయ్య, సీటీ నేత నాగార్జున ,కృష్ణకుమారి, లక్ష్మి, బాదుల్లా ఉద్యోగులు నాలుగో తరగతి జిల్లా నాయకులు కాటమయ్య, జానకి పాల్గొన్నారు.




## 6వ రోజు శ్రీమహాలక్ష్మీ రూపంలో ఇరుగులమ్మ తల్లి

గాలివీడు, సెప్టెంబర్ 27(ప్రభాతవార్త):



దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 6వ రోజైన శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజారివాండ్లపల్లె ఇరుగులమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ మాట్లాడుతూ శరన్నవరాత్రుల్లో మహాలక్ష్మీని పూజిస్తే మంగళప్రదమని, లక్ష్మీదేవి అంటేనే సంపదకు ప్రతిరూపం గనుక అమ్మవారిని పూజిస్తే ఎలాంటి కోరికైనా నెరవేరుతుందన్నారు. అమ్మవారు అనుగ్రహించే వరాలను బట్టి ఆమెను 8 రూపాలలో పూజిస్తారని వాళ్లే అష్టలక్ష్ములుగా ఆరాదిస్తారన్నారు .దసరా సందర్భంగా మహాలక్ష్మీని కనుక పూజిస్తే ఈ అష్టలక్ష్ములంతా అనుగ్రహిస్తారన్నారు.

**CHANGE OF NAME**

I Yerragorla Venkata Varun Sai (OLD NAME), D.No.26/940-3, Mittamadi Street, Proddaturu (T&M), YSR Dist. AP. Here Change My Name as YARRAGORLA KARRTHIKEYA (NEW NAME), S/o Yarragorla Chandra Sekar, Hence forth I May be called as YARRGORLA KARRTHIKEYA.

## చిన్నపిల్లల వైద్యులను నియమించాలి

బద్వేలు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



పట్టణ, పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రులలో గైనకాలజీస్ట్, చిన్నపిల్లల డాక్టర్లను భర్తీ చేసి, నిరూపయోగంగా వున్న స్కానింగ్ సెంటర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ శనివారం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్బంగా ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బద్వేల్, పోరుమామిళ్ల పట్టణ పట్టణాలల్లో వున్నా ప్రభుత్వ హాస్పిటల్ లకు రోజుకు వందలాది మంది గర్భిణీలు, చిన్న బిడ్డల పరిస్థితిని తెలుపుకోవడానికి, కాన్పుల కోసం నిత్యం వస్తుంటారని, అలాంటి పరిస్థితులల్లో పేదల వద్దకే వైద్యం అని పదే పదే ఊదర కొడుతున్న కూటమి పెద్దలు, అధికారులు సంవత్సరం నుంచి ఖాళీగా వున్న గైనకాలజస్ట్, చిన్నపిల్లల వైద్య పోస్టులను భర్తీ చెయ్యక పోవడం బాధాకారమన్నారు. కావున అధికారులు స్పందించి చిన్న పిల్లల వైద్యులను, స్కానింగ్ సిబ్బందిని నియమించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు కె.జకరయ్య, బి.అనిల్, ఏరియా కమిటీ సభ్యులు. రామరాజు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా చేయండి

ప్రొద్దుటూరు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం అమరావతిలో మంత్రి సత్యకుమారును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం జమ్మలమడుగు మైదుకూరు నియోజకవర్గాలతో పాటు ప్రతిపాదిత పోరుమామిళ్ల నియోజకవర్గం కమలాపురం నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ ప్రొద్దుటూరు జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బిజెపి సోషల్ మీడియా రాయలసీమ జోన్ ఇన్చార్జి గొర్రె కృష్ణ, ఈటీవీ భాస్కర్ పెంచలయ్య చేనేత సంఘాల నాయకుడు కులసాల రామచంద్రుడులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో నాలుగేళ్లుగా ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండ్ ఆవరణలో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజలు మాట్లాడుతూ చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నదానం నిర్వహించడం, మంచి నాణ్యత కలిగిన భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన మరింత కాలం పేదలకు సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్ బంగి శివ, బోడే ప్రసాద్, యేసునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జిఎస్టిపై పండుగలా ప్రచారం చేయండి

తంబళ్లపల్లె సెప్టెంబర్ 27 ప్రభాతవార్త ః



మండలంలోని మహిళా సంఘాలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్టీ రాయితీ ఈ నెల 22 నుండి అమలుతో సామాన్య ప్రజలకు భారీ ఊరట లభించిందని ఈ సూపర్ జీఎస్టీ రాయితీ పై ప్రతి గడపలో ప్రతి మహిళకు అవగాహన కల్పించి ఓ పండుగలా సంఘ మిత్రలు ప్రచారం చేయాలని ఎంపీడీవో థామస్ రాజా, ఏపిఎం గంగాధర్ లు పిలుపునిచ్చారు. సోమవారం ఐకెపి కార్యాలయంలో వారు మాట్లాడుతూ జీఎస్టీలో రాయితీతో తగ్గిన నిత్యవసర వస్తువుల ధరలను సభ్యులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సమీక్షలో సి.సి లు కత్తి నరసింహులు, రమణ, భాష, ఆదిలక్ష్మి సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీఐఐసీ డైరెక్టర్ మై ఫోర్స్ మహేష్‌కు సన్మానం

పెద్దమండెం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



ఏపీఐఐసీ డైరెక్టర్గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మై ఫోర్స్ మహేష్‌ని శనివారం పెద్దమండెం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బీటెక్ సుమన్ సన్మానించారు. మదనపల్లిలోనే అతని నివాసంలో అభినందించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఏపీఐఐసీ డైరెక్టర్గా బాధ్యతలు చేపట్టిన మీరు మదనపల్లె పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేయాలని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గల్లా నారాయణ చంద్రారెడ్డి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

సిద్ధవటం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



మండల కేంద్రమైన సిద్ధవటంలోని ఎగువ పేట, ఎస్సీ ఎస్టీ కాలనీలో అర్హులైన గృహ నిర్వాహకులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ తహశీల్దార్ మాధవి లత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు అర్హులైన ఎస్సీ ఎస్టీ కుటుంబాల యజమానులకు పంపిణీ చేశామని స్మార్ట్ రేషన్ కార్డు వల్ల కలిగే సౌకర్యాలపై తెలిపామని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ బాబయ్య వీఆర్వో కేశవులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కడప శిల్పారంలో దసరా ఉత్సవాలు..

కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:




శిల్పారామంలో దసరా ఉత్సవాలు ఈనెల 28 నుంచి అక్టోబర్ 2 తేదీ వరకు నిర్వహిస్తామని శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం కడప స్టేట్ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంస్కృతిక సాంప్రదాయాలతో, బుల్లితెర డాన్స్, పల్లె జానపదాలు మాస్ నృత్యాలతో వైభవంగా దసరా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. చేతి వృత్తి ప్రదర్శనలు, లండన్ బస్సు, ట్రాక్టర్ ట్రైను, కొలంబస్, డాష్ కార్లు ఉంటాయని చెప్పారు. గుర్రపు స్వారీ త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. పచ్చికబైళ్లల్లో ఫోటో షూటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పడవ విహారం, పాతబడిన తుక్కుబడిన విగ్రహాలు ఏర్పాటు చేస్తాము. విలేజ్ మ్యూజియం ఉంటుందని, అందులో మంగలి, వడ్రంగి, చెప్పులు కుట్టే వాళ్ళు ప్రతిమలు ఉంటాయని చెప్పారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి పాటలు, కూచపూడి, భరతనాట్యం, నిర్వహించి ప్రశంసా పత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## సూపర్ సేవింగ్స్ సూపర్ జీఎస్టీ పై అవగాహన

ముద్దనూరు. సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:




కేంద్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువులు, పలు వస్తువులపై జీఎస్టీ ఫైవ్ పర్సెంట్‌కు తగ్గించడంతో పేద మధ్యతరగతి కుటుంబాలకు కొంత వెసులుబాటు కల్పిస్తుందని శనివారం ముద్దనూరు మండల సమైక్య కార్యాలయం ఆవరణలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ మత్తు పదార్థాల నివారణ, మహిళల భద్రతపై ఎంపీడీవో రాధాకృష్ణ వేణి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ దస్తగిరి మాట్లాడుతూ మహిళల సంరక్షణ, మత్తు పదార్థాల నివారణపై పలు సూచనలు సలహాలు చేశారు. మండల గ్రామ సమైక్య సిబ్బంది వారి పరిధిలోని సభ్యులకు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సేవింగ్స్, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అపర్ణ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బాబుల రెడ్డి వెలుగు సీసీలు, ఈవో లక్ష్మీ నరసింహులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## కుర్చీ కోసమే కడప మేయర్‌ను తొలగించారు

కడపకార్పొరేషన్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త




కడప నగర మేయర్ కె సురేష్ బాబును హైకోర్టు తొలగించినదని టిడిపి నగర కార్యదర్శి సుబ్బారెడ్డి అబద్ధాలు చెబుతున్నారని కార్పొరేటర్ మల్లికార్జున, కే బాబు, బీసీ నాయకులు బసవరాజులు మండిపడ్డారు. ఇందులో వాస్తవం లేదు. రూల్స్ కు వ్యతిరేకంగా పనులు చేశాడని ఆరోపణలు మాత్రమేనని, మేయర్ అవినీతి చేయలేదని చెప్పారు. కుటుంబ సభ్యులు పనులు చేయకూడదని రూల్స్‌లో ఉన్నది. దేశంలో ఎక్కడా లేనివిధంగా కడపలో మాత్రమే మేయర్ ను కుర్చీ కోసం కుట్రలు చేసి తొలగించారని ఆరోపించారు. కడప నగరంలో వైసిపి పాలకవర్గం చేసిన అభివృద్ధిని కుటిమి అభివృద్ధిగా చెబుతుందని విమర్శించారు. కార్యక్రమంలో మల్లికార్జున కిరణ్, అలీ అక్బర్, గౌస్ బాషా, శివకోటి రెడ్డి, రెడ్డి ప్రసాద్, త్యాగరాజు, రామకృష్ణారెడ్డి, షబ్బీర్, జిలాని, రామ లక్ష్మారెడ్డి, బండి ప్రసాద్, చంద్రహాస్ రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, ఈటి రామచంద్రయ్య, అజ్మతుల్లా నాగమల్లారెడ్డి, సింధు పాల్గొన్నారు.

## పంచాయతీల ఆదాయ వనరుల పెంపుపై శిక్షణ

రామసముద్రం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త

మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఆదాయ వనరుల పెంపుపై ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో ఇంటి పన్నులు, భవననిర్మాణ అనుమతులు చేపల చెరువు, లైసెన్స్ ఫీజు, చింతమానులు వేలం పాటలద్వారా పంచాయతీల ఆదాయం పెంచుకొని స్థానిక సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఇందుకు సంబంధించి రీసోర్స్ పర్సన్ సర్పంచ్‌లు, కార్యదర్శులు, పంచాయతీల సచివాలయ సిబ్బందికి సమగ్ర సమాచారంతో శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్నా ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిఎస్టీ 2.0 పై సమీక్ష సమావేశం

చిన్నమండెం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:



మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన జిఎస్టి 2.0 పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో జిఎస్టీ 2.0 వలన కలిగే లాభాలను గురించి చర్చించారు. అలాగే కొనుగోలు దారు,వస్తు వినియోగ దారులకు చేకూరే లబ్ధి గురించి మరియు పన్ను రాయితీలను గురించి వివరించారు. ఇందులో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్ర, మండల తహసిల్దార్ ఎస్సై సుధాకర్, మండల వ్యవసాయ అధికారి గీత, ఏఎస్ఓ మరియు మండలంలోని అందరు మండల స్థాయి అధికారులు మరియు మండల జీఎస్టీ కమిటీ సభ్యులు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆటోమొబైల్‌పై విద్యార్థులు అవగాహన

లక్కిరెడ్డిపల్లి సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



ఆటోమొబైల్ వాహన సర్వీసులపై విద్యార్థుల అవగాహన కలిగి ఉండాలని డిసిడిఓ సుమతి పేర్కొన్నారు. జిల్లా వృత్తి విద్య సమన్వయకర్త ఆర్ కమలాకర్ యోగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శివ గ్యారేజ్ లో ఐదు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత పెంచుకోవాలని విధితో పాటు చేతి వృత్తి విధానాలపై పట్టు సాధించాలన్నారు పరిజ్ఞానంతో పాటు వృత్తి విద్యలతో కూడా భవిష్యత్తు సాధించవచ్చు అని ఆమె తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీల పురోగతి పై దృష్టి సారించండి

లక్కిరెడ్డిపల్లె; సెప్టెంబర్ 27. ప్రభాతవార్త



పంచాయతీల పురోగతిపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో పంచాయితీ పురోగతిపై సూచిక ఒకరో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయితీ పురోగతిపై 27 శాఖలు గురించి ఆన్లైన్లో పొందుపరచాలన్నారు 27 శాఖల యొక్క ఒక్కొక్క టీం తొమ్మిదిగా వెళ్లి పంచాయతీలోని సమస్యలు పై దృష్టి సారించి ఆన్లైన్లో పొందుపరచాలన్నారు తొమ్మిది మంది టీం 27 లక్షల పై దృష్టి సారించి పురోగతిని అభివృద్ధి చేయాలన్నారు 2024-25 సంవత్సరాల సంబంధించిన అన్ని గ్రామాలు ఏ ప్లస్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలన్నారు అంతే కాకుండా జిఎస్టిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రామంలోకి వెళ్లి సర్వేలు నిర్వహించి సమస్యలను ఆన్లైన్లో ఖచ్చితంగా పొందుపరచాలన్నారు ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి ఉషారాణి ఎస్సై రవీంద్ర ఎంఈఓ వెంకటసుబ్బయ్య ఏపీవో నిరంజన్ వ్యవసాయ అధికారి రాజకుమారి మెడికల్ ఆఫీసర్లు వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## శ్రీశక్తి పథకం అమలుపై మంత్రిని కలిసిన నాయకులు

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



మంత్రిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీశక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు రాష్ట్ర సహకార వ్యవసాయ శాఖామంత్రి కింజరపు అచ్చంనాయుడును రాష్ట్ర పిడిటి నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు కలిశారు. శనివారం వారు మంత్రిని కలసి శాలువతో ఘనంగా సన్మానించి శ్రీశక్తి పథకం విజయవంతంపై అభినందనలు తెలిపారు. ఏపి పిడిటి నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రిని కలిసి సన్మానించడం జరిగింది. ఈసందర్భంగా శ్రీ శక్తి పథకం అమలులో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఆర్టీసిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. సొసైటి నిర్వహణలో చక్కగా చేస్తున్న మేనేజింగ్ కమిటీని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సిసిఎస్ పాలకవర్గ సభ్యులు అనంతరాముడు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ జగన్ ముఖ్యమంత్రి కావడం తధ్యం

### వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్

మదనపల్లె, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :



మళ్ళీ సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావడం తధ్యమని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్ తెలిపారు. శనివారం పుంగనూరు నియోజకవర్గం టి.సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన కమిటీల సమావేశంలో నిస్సార్‌అహ్మద్ మాట్లాడారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా తొలిసారిగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సదుం మండలంలో ఏర్పాటు చేసిన కమిటీలు ఆదర్శమన్నారు. మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తే గతంలో మాదిరి కాకుండా ప్రతి కార్యకర్తకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో కూడా త్వరలోనే కమిటీలు పూర్తి చేస్తామని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ శాయశక్తులా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సజ్జల రామక్రిష్ణారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కలసపాడు, సెప్టెంబర్ 27ప్రభాతవార్త:

మండలం కేంద్రంలోని 13 పంచాయతీలలో రైతులు ఉల్లి సాగు చేశారు. ఉల్లి గిట్టుబాటు ధర లేక నష్టాలలో రైతులు కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పట్టించుకోని ఉల్లి రైతులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు.

## దసరా దీపావళి జిఎస్టి సంబరాలు జరుపుకోండి

సుండుపల్లె, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త :



సిఎం నారా చంద్రబాబు నాయుడు దసరా నుండి దీపావళి వరకు సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యాచరణ ప్రకటించిన విషయం విధితమే ఈ సందర్బంగా సుండుపల్లె పంచాయతి ఆఫీస్ నందు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామ నాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి వస్తువు కొనుగోలు పైన జిఎస్టిని 5 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వలసినదిగా తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు, బిజెపి నాయకులు జగదీష్ స్వామి, జనసేన నాయకురాలు రెడ్డి రాణి, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## రమేష్‌నాయుడికి ఘనంగా సన్మానం

గాలివీడు, సెప్టెంబర్ 27(ప్రభాతవార్త):



శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన పోతుగుంట రమేష్ నాయుడిని బీజేపీ నాయకులు సన్మానించారు. శనివారం రాయచోటిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆయనకు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీలో సుదీర్ఘంగా సేవలందించిన రమేష్‌నాయుడిని గుర్తించి శ్రీశైలం బోర్డు ఛైర్మన్‌గా నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డా.పాలగిరి శ్రీనివాసరాజు, శివగంగిరెడ్డి, రేవనూరి రాజ్‌కుమార్, ఎర్రనాగు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు జీఎస్టీ 2.0 గురించి అవగాహన

వేంపల్లి: సెప్టెంబర్ 27 (ప్రభాత వార్త):



గాంధీరోడ్‌లో గల వినాయక నగర్ డ్వాక్రా మహిళలతో వి ఏఓ ఉమాదేవి ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో ముఖ్య అతిధిగా జనసేన పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్. హరీష్ పాల్గొన్నారు. జీఎస్టీ 2.0 మరియు మహిళా భద్రత గురించి,తగ్గిన నిత్యావసర వస్తువుల గురించి వివరించారు. ప్రతి గృహానికి అవసరం ఉన్న నిత్యావసర వస్తులువు అన్నిటి పై జీఎస్టీ తగ్గించడం జరిగిందని, మాదకద్రవ్యాలు ఆల్కహాల్, సిగరేట్, గుట్కా వంటి వాటి పై జీఎస్టీ పెంచడం జరిగిందని, ఖరీదైన కార్లు, బైకులపై మాత్రమే పెంచడం జరిగిందని, ప్రతి మహిళ భద్రత కోసం "శక్తి" యాప్ రూపోందిచడం జరిగిందని, ప్రతి మహిళ ఉపయోగించుకోవాలన్నారు.

## ధన లక్ష్మి అవతారంలో...

బ్రహ్మంగారి మఠం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త

శ్రీ దేవి శరన్నవరాత్రుల దసరా ఉత్సవాల లో భాగంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దర్శనానికి బ్రహ్మంగారిమఠం ఆలయ పూర్వపు పీఠాధిపతి జేష్ట కుమారుడు వెంకటాద్రి స్వామి ధర్మపత్ని ఉమా దంపతులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, మరియు అధ్యక్షులు వెంకటసురేష్ బాబు దంపతులు,కార్యదర్శి సుంకు సురేష్ బాబు, ముచ్చర్ల శేషయ్య, ముచ్చర్ల సత్యానారాయణ, వెంకటాద్రి స్వామి దంపతులకు శాలువా కప్పి పూల మాల సత్కరించి పూజలు నిర్వహించారు. శనివారం ధనలక్ష్మీ అవతారం లో భక్తులకు దర్శన మిచ్చారని అధ్యక్షుడు వెంకట సురేష్ బాబు తెలిపారు, ఉభయ దాతలైనా కటకం రామ కృష్ణ ధర్మపత్ని మహలక్షుమ్మ, పబ్బతి కృష్ణయ్య ధర్మపత్ని బాల వెంకట సుబ్బమ్మ, పబ్బతి రామ చంద్రయ్య ధర్మపత్ని లక్ష్మీదేవి, సుంకు చిన్న సిద్ధయ్య ధర్మపత్ని వరలక్షుమ్మ అమ్మవారి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాకం సుధాకర్, దుగ్గి శెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహిళలు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## స్వాతంత్రోద్యమ చరిత్రలో నిప్పుకణం భగత్ సింగ్

బద్వేలు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త



అఖిల భారత విద్యార్థి అసోసియేషన్. ఆధ్వర్యంలో శనివారం భగత్ సింగ్ 118 వ జయంతిని ఘనంగా నిర్వహించారు.. సిద్దవటం రోడ్‌లో వున్న భగత్ సింగ్ విగ్రహానికి జిల్లా నాయకులు. బి, అనిల్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా అనిల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుదు, విప్లవకారుడనీ ఆయన సేవలు కొనియాడారు. అలాగే విప్లవ నినాదాలు ప్రజలను చైతన్యం చేయడానికి అతను ఢిల్లీ వీధుల్లో ఎర్ర కాగితాలు చల్లి, విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చారని. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం భగత్ సింగ్ బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలోయువజన నాయకులు. నారాయణ, దీక్షిత్, కృష్ణ, దినేష్, రియాజ్, యశ్వంత్, వెంకట కృష్ణ, మోక్షజ్ఞ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

పీలేరు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:



పాలా అభిషేకం చేస్తున్న నాయకులు

రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యా విద్యాశాఖ మంత్రి, పీలేరు ఎమ్మెల్యేల చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పీలేరు నాలుగు రోడ్ల కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి, కేవలం 150 రోజుల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడాన్ని ప్రశంసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉపాధ్యాయ నాయకులకులు చెప్పారు. ఈ సందర్భంగా నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి రమేష్ మాట్లాడుతూ గతంలో ఐదు సంవత్సరాల కాలం పాటు నిరుద్యోగులు డియస్సీ కోసం ఎదురుచూసారని, కానీ గత ప్రభుత్వం ఒక డియస్సీ కూడా నిర్వహించలేదన్నారు. టిడిపి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమనేది సిఎం గొప్పతనమన్నారు. అదేవిధంగా ఏపీ సిపియస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం సూపర్ సిక్స్‌లో భాగంగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, అమర్నాథ్, మస్తాన్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం ధర్మయ్య, శివశంకర్, జనార్దన్ రెడ్డి, జయరాం, వేణుగోపాల్, కిరణ్, ఎం.ఆర్.పి.ఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :




మాట్లాడుతున్న నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక రంగంలో ముందుకు వెళ్లాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ కోఆర్డినేటర్ ప్రదీప్ తెలిపారు. శనివారం పీలేరు ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో మైభారత్ కడప, షీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు కార్యశాల (వర్క్షాప్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. కళాశాల చైర్మన్ అవినాష్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఎన్. రావు మాట్లాడుతూ చక్కటి ఉద్యోగ అవకాశాలు పొందేలా తమ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు మై భారత్, షీ సన్యస్థ కృతజ్ఞతలు తెలిపారు. షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్ లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక అవకాశాలను యువత గుర్తించి, వాటిని వినియోగించుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాల వైపే కాక స్టార్టప్ కార్యక్రమాలపై అవగాహన పెంచుకొని ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర పరిశ్రమలను స్థాపించే దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షీ సంస్థ న్యాయ సలహాదారులు రాయల సుధాకర్ రాయలు, ఎంజెఆర్ కళాశాల అధ్యాపక బృందం, ఎంబిఏ, బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగం ప్రధానమైన రంగం

వేంపల్లి: సెప్టెంబర్ 27 ప్రభాతవార్త



పర్యాటక రంగం ప్రధానమైన రంగమని, ఈ రంగాన్ని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ మాజీ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం అయిన కడప జిల్లాలోని గండి క్షేత్రాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పర్యాటకంపై అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా సెప్టెంబర్ 27 ను ప్రపంచ పర్యాటక దినంగా 1980లో ప్రకటించింది అన్నారు. జిల్లాలో గండికోట, సిద్ధవటం కోట, గండి, ఒంటిమిట్ట కోదండ రామ స్వామి దేవాలయం, అమీన్ పీర్ దర్గా, దేవుని కడప దేవాలయం, బ్రహ్మంగారిమఠం, సంగమేశ్వర దేవస్థానం, లంకమల్ల అభయారణ్యం, పుష్పగిరి ఇలా ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటికి తగిన ప్రచారం, వసతులు ప్రభుత్వం కల్పించాలని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, భాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లలితా మహా సుందరీదేవి అలంకారంలో అమ్మవారు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:



మండలంలోని గంగనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం నందు శనివారం శ్రీ పార్వతి అమ్మవారు శ్రీలలితా మహాసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఉభయదారులైన ఎ.సత్యనారాయణ(అర్చక) మరియు వారి కుటుంబ సభ్యులు వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీలలితా మహాసుందరీదేవికి ప్రత్యేక పూజలు చేయగా అనంతరం ఆలయ నిర్వాహణాధికారి ఎం.కృష్ణానాయక్, టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఉభయదారులకు అమ్మవారి పసుపు కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అత్యుత్సాహం ప్రదర్శించిన ఆర్టీసీ డ్రైవర్

పెండ్లిమర్రి, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:

పెండ్లిమర్రిలో శనివారం ఎస్సై తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో కడప పులివెందుల ఆర్టీసీ బస్సు డ్రైవరు అతి వేగంగా బస్సు నడుపుతుండడంతో ఎస్సై మధుసూదన్‌రెడ్డి నిలిపాడు. బస్సు నిండా విద్యార్థులు, మహిళా ప్రయాణికులు ఎక్కువగా ఉన్నారని నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం తగదని ఎస్సై ప్రశ్నించారు. దీంతో డ్రైవర్ అత్యుత్సాహంగా 75 కి.మీ 90 స్పీడు బ్రేకర్లు ఉన్నాయని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. ప్రయాణికుల క్షేమం కోసం పాటుపడిన ఎస్సైని పలువురు ప్రశంసించారు. ఎస్సై మాట్లాడుతూ ఏ తరహా వాహనమైనా డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేస్తే కుటుంబ సభ్యులు సంతోషంగా, క్షేమంగా ఉంటారని తెలిపారు.



